కథ

# మీ దారిలోనే...నేను

బయట ఎండ నిప్పులు చెరుగుతోంది. ఎట్టకేలకు ఓ గంటన్నర నిర్విరామ ప్రయత్నంలో ఆ ఇంటికి చేరుకోగలిగేను. ఇల్లు చాలా పెద్దది. బయటంతా పూలమొక్కలు.

ఇల్లు సమీపించడంతో - ఆ మిట్టమధ్యాహ్నపుటెండలో కాళ్లరిగిపోయేలా, శోష వచ్చి పడిపోయేలా తిరిగిన నాకు కాస్త ఆనందం లభించింది. ఆ సమయంలో నన్నెవరు చూసినా ఆశ్చర్యపోక మానరు. దుర్బలమైన శరీరంతో, మాసిన గెడ్డంతో, మరీ మాసిన గుడ్డలతో వున్న నన్ను చూసి, ఓ ప్రముఖ తెలుగు రచయిత ఇతనే అని ఎవరైనా చెప్పినా నమ్మరుగాక నమ్మరు.

జీవితం అంటే వెలుగుతో జీవించడం మాత్రమే కాదు. ఆ వెలుగును సువాసనతో నింపుకుని మరీ బ్రతకాలని పెద్దలంటారు.

మూసి వున్న ఆ తలుపులకవతల, అంటే?.. ఆ ఇంటి లోపల సంధ్య వుండి తీరాలి. ఆమె హృదయంలో ఇప్పటి దాకా రేగిన మంటలు చల్లారి ఆ స్థానంలో అనురాగమయమైన దాంపత్య జీవితం గురించిన విషయం ఆక్రమించి వుండాలి.

సంధ్యాగమనం కోసం నిరీక్షిస్తూ చూస్తున్న ఆ నిముషంలో, మూసి వున్న ఆ తలుపులు బద్ధాల్ని తెరుచుకున్నాయి. అటు చూసేను. అక్కడ ద్వారబంధం దగ్గర మా వైవాహిక బంధాన్ని కాలదన్ని వచ్చేసిన సంధ్య నించుని వుంది.

★ ★ ★

''మైడియర్ భర్తగారూ!!

మిమ్మల్ని మిమ్మల్నిగానే ప్రేమించేను తప్ప, ఓ పెద్ద రచయితని తెలిసి ప్రేమించలేదు. మీపేరు చెబితే ఆంధ్రదేశంలోని ప్రతీ ఇంటి గడప మీకు నీరాజనాలు అర్పిస్తుందని, మీతో కలిసి ఏడడుగులు కాదు, మూడడుగులు వేసినా చాలు జన్మ ధన్యమౌతుందని ప్రేమించలేదు. నా మనస్సు కోరుకున్నది మీనుంచి రవంత అనురాగం, మీనుంచి పిడికెడంత ప్రేమ. అంతేగాని, రాత్రింబగళ్లు తెల్లకాగితాలు దొంతరలు ముందేసుకుని కథలు వ్రాసుకుంటూ, మీతో పాటు మరో ప్రాణి మీకోసమై అల్లలాడి బ్రతుకుతుందన్న నిజాన్ని మీరు మరచిపోతారనిగాదు...'' దుఃఖంతో గొంతు పూడ్చుకుపోగా, పక్కమీద బోర్లాపడిపోతూ అంది

నిజానికి అక్కడకు చేరకముందే నా హృదయం మరణించింది. 'కీ' ఇచ్చి వదిలితే తిరిగే మరబొమ్మలా కదులుతున్న గుండెల్లో స్పందనలనేవి ఏనాడో చచ్చిపోయేయి.

మూసి వున్న తలుపుల దగ్గరగా నడిచి, తలుపు మీద చేయి వేయబోయి రక్కున ఆగిపోయేను. అందంగా వ్రాసి వున్న 'నేమ్‌ప్లేట్' కన్పించింది. దానిమీద నరేంద్ర, ఎమ్.ఏ అని వుంది. ఆ అక్షరాలను చూడగానే బహుశా నా కళ్లు అరుణ రేఖలతో జ్వలిత గోళాల్లాగ మారి వుంటాయి. ఎందుకంటే నా కళ్ల ఎరుపు నాకు నిపించదు గనక. నా కళ్లల్లో ఏదో మార్పు వచ్చినట్లు తెలుస్తోంది నాకు.

మనస్సులో కదిలే మహోగ్రాన్ని కన్నీళ్లా దాయగలదు? 'సముద్రం కన్నా మహత్తరమైనది ఆకాశం, ఆ ఆకాశం కన్నా గొప్పది మనిషి ఆత్మ' అని అంటాడు విక్టర్ హ్యూగో. అంత గొప్పదైన ఆత్మను చంపేసుకుని, నిస్సిగ్గుగా అక్కడికి చేరిన నన్ను ఏమంటారో నాకే తెలీదు. నాకే కాదు, నా గురించి తెలిసిన వాళ్లకీ, ఈ మార్పు చూసేక నన్నేమనాలో తెలీదనే నేననుకుంటాను.

''నిర్భాగ్యుడిలా, గుడి కట్టకుండ వదిలేసిన శిలా మూర్తిలా దిక్కులు తోచక నించున్నట్లు నించున్నానక్కడ.

**ఏదో ఆలోచిస్తున్న నేను నరేంద్ర పిలుపుతో ఉలిక్కిపడ్డాను. నరేంద్ర పక్కనే ప్రతిభ నిలుచుని వుంది. సంధ్య కోసం నా కళ్లు వెదికాయి. అది గమనించాడు నరేంద్ర. అతని ముఖంలో చిర్నవ్వు. అది నాగుండెల్ని మరింతగా ముక్కలు చేస్తున్న ఫీలింగ్ కలుగుతోంది**

ఓ పదినిముషాలు అతి కష్టంగా, భారంగా దొర్లిపోయేయి. గడిచిన ప్రతీక్షణం హృదయంలో ప్రాణజ్వాల జ్వలిస్తూ వుంటుందనేది వాస్తవమే అయితే, నేనక్కడ నించున్న ఆ కొద్దినిముషాల్లో, కొన్నివందల క్షణాలు ఎన్నెన్ని జ్వాలలను జ్వలించి వుంటాయో?

సంధ్య. ఓ సాయం సంధ్య వేళలో, పశ్చిమ దిగంతంలో సూర్యుడు సిందూర వర్ణం దాల్చి, అస్తమయ కర ప్రభల్ని లోకం మీద సంధిస్తున్నప్పుడు...

మనస్సులోని కాంక్షలు కార్యరూపం దాల్చవని తెల్సినప్పుడు మనిషి చెందే ఆవేదన సంధ్యలో కనిపిస్తోంది.

అందుకే ఆమె దగ్గరగా చేరి ఆమె సుకుమార తనూలతపై మృదువుగా నిమురుతూ నేనొకటే మాట అన్నాను.

''ఓ రచయిత జీవితం యొక్క ఆశయం, తన చుట్టూ వున్న సమాజాన్ని జాగృతం చేసి, ప్రగతి వేపు పయనించేలా దారి చూపడం. చీకట్లు ముసురుకున్న సమాజానికి వెలుగుదారులు రచయితవే కాబట్టి నేనా ప్రయత్నంలోనే వ్రాసుకుంటూ పోతున్నాను. అంతేగాని, నిన్ను నిర్లక్ష్యం చేయాలని కాదు సంధ్యా!!...అంతే'' అన్నాను.

ఆ తర్వాత ఆమె లేచిందో, ఇంకా అలాగే పక్కమీదనే వుందో లేక ఏమయిందో ఆ క్షణంలో నేనాలోచించలేదు. కాని..నేను ఆమెకోసం నా మనసు విప్పి, ఆ మనసుపడే ఆరాటాన్ని ఆమెతో చెప్పాలనుకునే సమయానికి ఆమె నా ఇంట్లో నుంచి తనకోసం తెచ్చుకున్న అనేక వస్తువులు నా ఇంట్లోనే వదిలి తాను మాత్రం ఒంటరిగా బయటకు వెళ్లి పోయింది. ఈ నిజాన్ని టీపాయి మీద అల్లిబిల్లిగా, కంగారుగా వ్రాసిన కొన్ని అక్షరాలతో వున్న ఓ చిన్న ఉత్తరం మాత్రమే చెప్పింది.

''రచయిత గార్కి...

పేరు పొందిన ఓ రచయితకు భార్యనన్న ముద్రతో...నా ఆనందాన్ని దుఃఖమయం చేస్కుంటూ బ్రతకలేకపోతున్నాను. అందుకే వెళ్లిపోతున్నాను. దయచేసి నాకోసం వెతక్కండి. మీ భార్యగా నేను లేచిపోవడంలేదు, మీ 'ఇజా'ల నుంచి, మీనుంచీ, నన్ను నేను కాపాడుకోవడానికే పారిపోతున్నాను. గ్రహించగలరు.''

★ ★ ★

ఆ ఇల్లు ఆమె తల్లిదండ్రులదైనా బావుణ్ణు. ఆమె అన్నదో, తమ్ముడిదో, అయినా బాగుండిపోను. ఇవేమీ కాకుంటే...ఆమె పిన్నిదో, పినతండ్రిదో, చెల్లిదో, అక్కదో, బావదో, ఎవరిదో ఒకరిది అయితే మరీ బాగుండిపోను.

జీవితంలో ఓ క్షణం అశ్రద్ధకు పూర్తి జీవితకాలం నష్టపోకుండా బ్రతుకును తిరిగి వెలిగించుకునేవాడిని. ఒక కొవ్వొత్తి జ్వాలతో, మరో కొవ్వొత్తి వెలిగిస్తే అది అదిగానే వుంటుంది, అది కాకుండానూ వుంటుందన్న భయం నాకు. ఆ ఇల్లు నరేంద్రది. ఒకప్పుడు సంధ్యను గాఢంగా అభిమానించేడతను. ప్రేమించేడేమో కూడాను. సంధ్య ఇప్పుడతని ఇంట్లో వుంది.

మూసి వున్న ఆ తలుపుల్ని తీసిన సంధ్య, తనకెదురుగా మూయని మనోనేత్రంతో, తన వంక ప్రేమగా, చూస్తున్న నన్ను పలకరించైనా పలకరించలేదు. విసవిసా నడుచుకుంటూ లోపలకు వెళ్లిపోయింది.

లోపల్నుంచి ఎవరివో మాటలు వినిపిస్తున్నాయి. అక్కడే నించుండిపోయేను.

సంధ్య నరేంద్ర ఇల్లు చేరిందన్న నిజం నా గుండెల్లో ఓ ఉరుములా ఉరుముతోంది. హృదయంలో మెరిసే మెరుపులన్నింటికీ ప్రపంచం ప్రతిబింబం అయితే, మరి?..ఈ ఉరుములకు ప్రపంచం ప్రతిధ్వని చేయాలి కదా?!...అసలు సంధ్య నన్ను విడిచిపెట్టి నరేంద్ర కోసం లేచిపోయి వచ్చేసిందన్న శంక మనస్సులో పీకుతోంది.

మాటలు రాని రాతిబొమ్మలాగా నించున్నానక్కడే. సంసారాన్ని జీవన గానంగా మలచుకోవాలన్న ఆలోచన

సంధ్యకు వుందోలేదోనన్న ఆలోచన కూడా నాలో రగులోంది.

లోపల్నుంచి ఈసారి బయటకువచ్చిన వ్యక్తి సంధ్యా కాదు, నరేంద్రాకాదు. ఆమె ప్రతిభ. మా పెద్దనాన్న కూతురు. నాకు చెల్లెలు. ప్రతిభ కూడా నరేంద్ర ఇంట్లోనే కన్పించేసరికి నాకు ఆశ్చర్యం రెట్టింపయింది.

ఏదో ఆలోచిస్తున్న నేను నరేంద్ర పిలుపుతో ఉలిక్కిపడ్డాను. నరేంద్ర పక్కనే ప్రతిభ నిలుచుని వుంది. సంధ్య కోసం నా కళ్లు వెదికాయి. అది గమనించాడు నరేంద్ర. అతని ముఖంలో చిర్నవ్వు. అది నాగుండెల్ని మరింతగా ముక్కలు చేస్తున్న ఫీలింగ్ కలుగుతోంది నాలో.

నా భుజంపైన నరేంద్ర చేయి పడింది.

''నువ్వు సంధ్యను వెదుక్కుంటూ వస్తావని నాకు తెలుసురా. నిజానికి సంధ్యను ఒకప్పుడు నేను ప్రాణంకన్నా మిన్నగా ఆరాధించిన మాట వాస్తవం. కానీ ఎప్పుడైతే ఆమె నిన్ను ప్రేమించి పెళ్లి చేసుకుందో ఆ క్షణంలోనే నా మనస్సులోంచి ఆమె రూపాన్ని పూర్తిగా చెరిపేయడం జరిగింది. సంధ్యలో ఇదివరకున్న ఆ నెమ్మదితనం, మృదువైన సరళి ఇప్పుడు లేవు. అందుకు విచారిస్తున్నాను. ఈ విషయంలో సంధ్యను ఒక్కదాన్నే నిందించదలచుకోలేదు'' ఆగి నావంక చూసాడు నరేంద్ర.

నా ఎదురుగావున్న గోడమీద దండలువేసుకున్న ప్రతిభా నరేంద్రల ఫోటో వుంది. ఆ ఫోటోవంక చూస్తున్నాను. మళ్లా అతనే అన్నాడు.

''ప్రతిభను ఈ మధ్యనే వివాహం చేసుకున్నాను. రిజిస్టర్ మ్యారేజీ. మా పెళ్లికి ఎవర్నీ పిలువలేదు. ప్రతిభకు ఇష్టంలేదు. మానేసాను. ఎవరున్నా లేకపోయినా నాకు ఆమె, ఆమెకు నేను ఒకరికోసం మరొక్కరుగా బతుకుతున్నాం.''

ఇదంతా నాకెందుకు చెబుతున్నాడో నాకర్థంకాలేదు.

మళ్లా నరేంద్రే మొదలుపెట్టాడు.

''రచయితగా మనకు కొన్ని ఆదర్శాలుంటాయి. కొన్ని తీర్చుకోదగినవి. కొన్ని అందని ద్రాక్ష పళ్లలా వూరించేవి. ప్రతి ఆలోచనా, ప్రతి అనుభూతినీ అక్షరాలుగా మార్చుకుని నీ రచనల్లో అమరం చేసుకున్నావు నువ్వు. కానీ నీ అర్ధాంగి ఆలోచనల్ని మనస్సును అర్థం చేసుకోలేక ఆనందంగా గడపాల్సిన జీవితాన్ని చీకటి చేసుకున్నావు. జీవితంపై ఎంత విరక్తి కలిగినా ఒక్కో సమయంలో జీవించాలన్న కోరిక మనకు ఎందుకు వుంటుందో తెలుసా? జీవితం రస సమ్మిళితం కనుక!'' ఆగేడతను.


ఏదో అడగాలని నోరు తెరిచానో లేదో నా నోటి దగ్గరగా ఓ చేయి వచ్చి ఆగింది. ఆ చేతిలో మంచినీళ్ళతోవున్న గ్లాసుంది. అవి అందుకుని త్రాగేసాక చూసేనా చేతిని. ఆ చేయి సంధ్యది.

''సంధ్య చాలా అమాయకురాలు. మరీ సెన్సిటివ్ కూడాను. నీతో గొడవ పడి లేచిపోయి నావద్దకు వచ్చేసిందన్న దురభిప్రాయంతో వచ్చేవు నువ్వు. కానీ మీమధ్య జరుగుతున్న కోల్డ్‌వార్ గురించి, ప్రతిభకు ఇంతకుముందే రాస్తూ ఎప్పటికైనా నిన్ను వదిలి మా దగ్గరకు వచ్చేస్తావని వ్రాసింది సంధ్య. ముందు బాధపడినా కాసేపు ఆలోచించాక ఆమెను రమ్మనే వ్రాసింది. ఈ విషయాలేవీ నీకు తెలీదు. ఒక్క మాట అడుగుతాను చెప్పు? తన భర్త ప్రేమించిన ఏ స్త్రీ అయినా, ఓ ఇల్లాలు తనింటికి రానిస్తుందా? వస్తే సహిస్తుందా? ''

ఇక సమాధానం చెప్పడం నావంతన్నట్లుగా చూసాడు నరేంద్ర. సంధ్య వంక చూసాను. ఆమె కనురెప్పల మాటున తళుక్కుమని మెరిసిన తడీ నా గుండెలను పట్టి కుదిపిన మాట వాస్తవం.

నా దగ్గరకు వచ్చింది ప్రతిభ.

''మీ ఇద్దరి మధ్యా ఏర్పడిన వెలితి పెద్దదేంగాదన్నయ్యా! వెల్తురు వుండగానే జీవితాన్ని ప్రకాశింపచేసుకోవాలని, అశ్రద్ధచేస్తే చీకటి తెరలు జీవితాన్ని చుట్టేస్తాయని నువ్వే ఏదో కథలో వ్రాసినట్లు గుర్తు.



యం. ఉమామహేశ్వరరావు

తనను అసలు నువ్వు పట్టించుకోలేదన్న బాధే సంధ్యలో తీవ్ర మనస్తాపానికి దారి తీసింది. అది నువ్వర్థం చేసుకోలేదు'' నా రెండు చేతుల్నీ పట్టుకుని అంది ప్రతిభ.

అంత వరకూ మౌన మునుల్లాడినై వూరుకున్న నేను చివరకు నోరు విప్పక తప్పలేదు.

''మన సామాజిక వ్యవస్థలో రచయితల పట్ల వుండే విలువా, గౌరవం తతిమా వారికుండదు. తాము బాధల్ని అనుభవిస్తున్నట్లు రచయితలకు తెలుసు. ఎందుచేతనంటే వాళ్ళనుభవించే బాధలు కూడా సామాజికమైనవేనని వాళ్ళ ఆలోచన. అందుకేనేమో నేను సంధ్య వేదనను గుర్తించలేకపోయాను. అంతేతప్ప సంధ్యను నేనెన్నడూ నిర్లక్ష్యం చేయలేదు. నిజం కాని దాన్ని నిజమనుకుని చూడని విషయాన్ని చూసినట్లుగా భావించుకుని బాధలుపడే, సంధ్యవంటి భార్యల మనస్తత్వాలను ఎవరూ ఎక్కడా చెప్పినట్లులేదు. సంధ్యవంటి స్త్రీలు ఎంతమందిలో వున్నా ఒంటరితనం ఫీలవుతారు. ఒంటరిగా వున్నప్పుడు మానసికంగా కృంగిపోతారు. నాకూ ఆమెకూ మధ్య జరిగిందిదే.''

ఇంకా ఏదో చెప్పబోతున్న నేను హఠాత్తుగా ఆగిపోయాను. సంధ్య నా ఎదురుగా వచ్చి నించుంది తలవంచుకుని. ఆమెనుంచి ఒకే ఒక్క మాట...

''ఎంతైనా రచయితలుగదా. మిమ్మల్ని అర్థం చేసుకోవడంలో ఎక్కడో ఏదో పొరపాటు జరిగిందని అంగీకరిస్తున్నాను. దాపరికాలు, పొరపొచ్చాలు లేని జీవితం కోసం మళ్లా మీదారిలోకి నేను...ఇక పదండి రచయిత భర్తగారూ! మీతో చాలా చాలా పనుంది నాకు'' అంటూ కొంటెగా నవ్వింది సంధ్య. ఆ నవ్వులోంచి రాలిపడిన పువ్వులను ఏరుకోవాలని మనసైతే ఎంతో ఉబలాటపడింది కానీ అక్కడ ఎలా వీలవుతుంది? అందుకే నేనూ నిశ్శబ్దంగానే అక్కడనుంచి బయటకి అడుగులు వేసాను. నా వెనక నన్నే అనుసరిస్తూ సంధ్య వస్తుండగా...

☆